చట్టవ్యతిరేక శక్తులపై నిరంతర నిఘా

- గోదావరిఖని ఏసీపీ రమేశ్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి


మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖని: చట్ట వ్యతిరేక శక్తులపై పోలీసుశాఖ నిరంతర నిఘా ఉంటుందని గోదావరిఖని ఏసీపీ రమేశ్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక బాపూజీనగర్‌లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి రవాణా, వినియోగంపై పోలీస్‌శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. అసాంఘిక శక్తులను గుర్తించేందుకు తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాపై యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే లింక్‌లు క్లిక్ చేయొద్దని, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు భూమేశ్, రమేశ్, శ్రీనివాస్, రామగుండం ఎస్సై సమ్మయ్య పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే షీటీం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ హిమబింద్ సింగ్

కోల్‌సిటీ: మహిళల భద్రత కోసమే షీ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు సిమ్స్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబింద్‌సింగ్, షీటీం ఎస్సై భూమేశ్ అన్నారు. గోదావరిఖనిలోని సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్) మెడికల్ కాలేజీలో గురువారం మెడికోలు, నర్సింగ్ స్టాఫ్‌కు ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రతీరోజు జన సమీకరణ ప్రాంతాల్లో షీ టీం నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే 63039 23700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్లు అనంతబాబు, శ్రీదేవి, శ్రీనివాస్, ఏఎస్సై మల్లయ్య, కానిస్టేబుళ్లు రామ్మూర్తి, స్నేహలత, సంపత్, సదానందం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో జీవో 22 అమలు చేయాలి


సీఎం రేవంత్‌రెడ్డితో నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో జీవో 22 అమలు చేయాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో 22 ప్రకారం వేతనాలు పెంచి, లాభాల్లో వాటా కాంట్రాక్టు కార్మికులకు కూడా ఇవ్వాలని విన్నవించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బుర్ర తిరుపతి, ప్రధాన కార్యదర్శి అక్బర్‌అలీ ఉన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై సతీశ్

జ్యోతినగర్: వాహనదారులు విధిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎన్టీపీసీ ఎస్సై కె.సతీశ్ సూచించారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌లో గురువారం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహన పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకోవాలన్నారు. వాహనాల నంబర్లు కనబడకుండా కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, రవాణాశాఖ నిబంధనలకు అనుగుణంగా హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారి వాహనాలను నిబంధనల ప్రకారం సెప్టెంబర్ 2 లోపు మార్చుకోవాలన్నారు. సెప్టెంబర్ 3 నుంచి ప్రతీరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన సూరమల్ల శ్రీనివాస్, పార్వంది సంపత్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాగా గురువారం వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి అజయ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, కాంపెల్లి రాజేశం ఉన్నారు.

గ్రామ దేవతలకు ముడుపు

జూలపల్లి: మండల కేంద్రంలో గ్రామ దేవతలైన పోచమ్మ తల్లులకు గురువారం గ్రామ పెద్దలు, పంబాల పూజారులు ముడుపులు కట్టారు. పదిరోజుల్లో గ్రామంలో నిర్వహించనున్న పోచమ్మ కొలుపు ఉత్సవాల్లో భాగంగా ఊర పోచమ్మ, కొండ పోచమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మ దగ్గరి పోచమ్మ, ముదిరాజ్ కాలనీ పోచమ్మ తల్లులకు ముడుపులు కట్టారు. నాయకులు, గ్రామపెద్దలు పొట్యాల మల్లేశం, కొప్పుల మహేశ్, అనిల్, మల్లారెడ్డి, శ్రీధర్, ఐలయ్య, కొమురయ్య, వెంకటనర్సు ఉన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం


సుల్తానాబాద్: వివేకానంద పాఠశాలలో..


జూలపల్లి: బ్రిలియంట్ పాఠశాలలో..

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల, కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గురువారం తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. తెలుగు బోధించే ఉపాధ్యాయులు, లెక్చరర్లు రజిత, హేమలత, శారద, శైలజ, అంజలి, రమ్యను సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని న్యూ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు టీచర్లు కంకణాల రవి, పారండ్ల కావ్యను సన్మానించారు. పాఠశాల కరస్పాండెంట్ కొండ సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..


గోదావరిఖనిటౌన్: సన్మానిస్తున్న అధ్యాపకులు

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు, కవి, రచయిత రాకుమార్, ఏలేశ్వరం వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై.కిషన్ ఓజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **కాంట్రాక్టు కార్మికుల వేతనాలపై స్పందించాలి**

గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలపై రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ మల్లు భట్టి విక్రమార్క స్పందించాలని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు కోరారు. ఈనెల 31న సింగరేణి పర్యటనకు గోదావరిఖనికి వస్తున్న క్రమంలో కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపు, లాభాల్లో వాటా తదితర సమస్యల పరిష్కారం కోసం ప్రకటన చేయాలని కోరారు. రాష్ట్రంలో అతిపెద్ద రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి, సింగరేణిలోని అన్ని విభాగాల్లో సుమారు 25వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. విద్య, వైద్యం, క్వార్టర్ సదుపాయం కల్పించాలని కోరారు.

- **మండలస్థాయి క్రీడాపోటీలు**

జూలపల్లి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వచ్చే సెప్టెంబరు 3, 4 తేదీల్లో మండలస్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో కవిత తెలిపారు. సెప్టెంబర్ 3న బాలికలకు, 4న బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో పోటీలు ఉంటాయని, 14ఏళ్లు, 17ఏళ్ల విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు.

- **రోడ్డుకు మరమ్మతు చేసిన ఆటో యూనియన్ సభ్యులు**

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ ఆదర్శ పాఠశాలకు వెళ్లే రోడ్డుపై గుంతలు పడి బస్సు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నట్లు విద్యార్థులు తెలపడంతో పెద్దాపూర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు రోడ్డు మరమ్మతు పనులు చేయించారు. గురువారం ట్రాక్టర్‌తో ఇరవై ట్రిప్పుల మొరం పోయించి రోడ్డును బాగు చేయించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు పెసరి పెద్దులు ఉన్నారు.

- **పాముకాటుతో పాడిగేదె మృతి**

ఓదెల: మండలంలోని గుండ్లపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని కీమలాటపల్లె గ్రామంలో కొట్టె ప్రభాకర్ అనే రైతుకు చెందిన పాడిగేదె పాము కాటుతో మృతిచెందింది. బుధవారం రాత్రి ఇంటి ఆవరణలోని పశువుల పాకలో ఉన్న గేదె పాము కాటుతో తెల్లవారిసరికే మృతిచెందినట్లు రైతు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూ.50వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

- **లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు**

గోదావరిఖనిటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి కేబినెట్ జాయింట్ సెక్రటరీ జయప్రకాశ్ చౌడ, శేగంటి విక్రమ్ జన్మదినం సందర్భంగా గురువారం గోదావరిఖనిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు స్ఫూర్తి ప్రధాన కార్యదర్శి మామిడిపల్లి శ్రీధర్ తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక గాంధీపార్కు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 100 స్టీల్ మీల్స్ ప్లేట్స్, తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించారు. ఓల్డ్ అశోక థియేటర్ లేబర్ అడ్డా వద్ద ఉదయం 150 మంది లేబర్స్‌కు అల్పాహారం అందించారు. స్ఫూర్తి అధ్యక్షుడు నార్ల ప్రసాద్, ట్రెజరర్ కోదాటి ప్రవీణ్, గుంత వినోద్, శేగంటి నరేశ్, కొలిపాక విజేందర్, ఎన్.మల్లిఖార్జున్ పాల్గొన్నారు.

- **ధరణి లాగిన్‌లో అంతరాయం**

ఓదెల: మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ధరణి లాగిన్‌లో గురువారం ఏర్పడ్డ అంతరాయంతో రైతులు ఇబ్బంది పడ్డారు. తహసీల్దార్ కార్యాలయంలో భూముల క్రయ విక్రయాలకు రైతులు స్లాట్‌లు బుక్ చేశారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ధరణి లాగిన్‌లో ఎర్రర్, ఆలస్యంగా ఓపెన్ కావటంతో రైతులు పడిగాపులు కాచారు. అధికారులకు సైతం ఇబ్బందులు తప్పలేదు.

- **వివాహిత ఆత్మహత్యాయత్నం**

రామగుండం: పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన కుంచపు రజిత(30) అనే వివాహిత జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తలకు గాయాలవడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. స్థానికులు గుర్తించి వైద్యసేవల నిమిత్తం గోదావరిఖని, కరీంనగర్ తరలించారు. మెరుగైన వైద్యసేవల నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. బాధితురాలికి భర్త లక్ష్మణ్, ముగ్గురు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి పేర్కొన్నారు.

- **క్రీడలతో మానసికోల్లాసం**

ధర్మారం: విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసం కలుగుతుందని సాయిమణికంఠ హైస్కూల్ చైర్మన్ జైన సురేశ్‌కుమార్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పాఠశాలలో విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతి అందించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **ఆర్‌ఎంపీ, పీఎంపీల నిరసన**

కోల్‌సిటీ: ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ గోదావరిఖనిలో రామగుండం ఆర్‌ఎంపీలు, పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బంద్ పాటించారు. స్థానిక అడ్డగుంటపల్లిలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ నాయకులు మాట్లాడారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై దాడులు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, ముస్తఫా, రమణ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అనారోగ్య సమయాల్లో ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై చేస్తున్న దాడులను అరికట్టాలని మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు గురువారం నిరసన తెలిపారు. కొలిపాక శంకర్, తీగల మధునయ్య, శ్రీనివాస్, క్రాంతిబాబు పాల్గొన్నారు.

- **నేడు సర్వాపూర్‌లో సివిల్‌రైట్స్ డే**

ఎలిగేడు: మండలంలోని సర్వాపూర్‌లో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్వర్ణ తెలిపారు. మండలస్థాయి అధికారులు, అంబేడ్కర్ అసోసియేషన్ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 17వ డివిజన్ సంతోష్‌నగర్ ఏరియాలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించారు. కొన్ని నెలల కిందట డ్రైనేజీ మ్యాన్ హోల్ కుండి కుంగిపోయింది. దాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఆదమరిచి మ్యాన్ హోల్ కుండిపై నుంచి వాహనదారులు వేళ్తే ప్రమాదం అవకాశం ఉంది. మున్సిపల్ అధికారులు స్పందించి కుంగిపోయిన డ్రైనేజీ మ్యాన్ హోల్ కుండీ సరి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నగరపాలక కమిషనర్, సీహెచ్.శ్రీకాంత్, ఫోన్ : 98499 05878

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫోటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 97053 46608

మేడిపల్లి గ్రామం సందర్శన


మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ పరిధిలోని మేడిపల్లి గ్రామాన్ని సింగరేణి సంస్థ రామగుండం రీజియన్-1 జనరల్ మేనేజర్ లలిత్‌కుమార్ గురువారం సందర్శించారు. మేడిపల్లి గ్రామ ఎస్సీకాలనీ, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంపై గ్రామ ప్రజలతో ఆయన మాట్లాడారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీకాలనీ సమస్యలను గ్రామస్తులు జీఎంకు వివరించారు. జీఎం సానుకూలంగా స్పందించారు. ఎస్సీకాలనీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయం గురించి త్వరలోనే సంబంధిత అధికారులతో సమావేశమై, సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జీఎంను సన్మానించారు. కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, సనపురి శ్రీనివాస్, ఈదునూరి మల్లేశ్ పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ

గోదావరిఖనిటౌన్: శ్రీశ్రీశ్రీ త్రిదండి జియర్ స్వామి ప్రజ్ఞా వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గోదావరిఖని విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రెయిన్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కె.జాహ్నవి వ్యాసరచన పోటీల్లో ప్రథమ, 8వ తరగతికి చెందిన వై.ప్రభాత్ చిత్రలేఖనం పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ అమరేందర్ తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.6వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సెప్టెంబర్ 2వ తేదీన హైదరాబాద్ ముచ్చింతల్‌లోని జీయర్‌స్వామి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానిస్తున్న కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లి సెయింట్ మేరీస్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. సుల్తానాబాద్‌లో ఉన్న 30 మంది వ్యాయామ ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. జిల్లా కోఆర్డినేటర్ లయన్ మాటేటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ షో రెడ్డి, క్లబ్ అధ్యక్షులు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, పిట్టల వెంకటేశం, పూసాల సాంబమూర్తి, రాయల్ల నవీన్, పూసాల రామకృష్ణ, పల్ల అనిల్ కుమార్, తూర్పాటి భార్గవ్ కృష్ణ, ఆడెపు సదానందం, దాసరి ప్రసాద్, నాగమల్ల ప్రశాంత్, చకిలం వెంకటేశ్వర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

పాలకుర్తి: రాష్ట్రంలో సెప్టెంబర్ 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సభ్యత్వ ప్రముఖ్ క్యాతం వెంకటరమణ పిలుపునిచ్చారు. పాలకుర్తి మండలంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 2న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభిస్తారని తెలిపారు. మండలంతో పాటు రామగుండం నియోజకవర్గంలో ప్రతీ పోలింగ్ బూత్ నుంచి 150కి తగ్గకుండా సభ్యత్వాలు నమోదయ్యేలా ప్రతీ ఒక్కరు కృషిచేయాలని నాయకులకు సూచించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, మండల అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్, బొడ్డు రాయమల్లు, గండికోట కుమార్, తిరుపతి, గడ్డం వేణు, వెంకటేశ్, చింతకింది శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తుల స్వీకరణ


రామగిరి: దరఖాస్తులు స్వీకరిస్తున్న మంథని ఏడీఏ అంజని

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రభుత్వం ప్రకటించిన రూ.2లక్షల రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. 30న అబ్బాపూర్‌లో, 31న కుమ్మరికుంటలో, సెప్టెంబరు 2న వడ్కాపూర్, 3న తేలుకుంట, 4న కాచాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. రుణమాఫీ కాని, రేషన్ కార్డు లేని కుటుంబాలు దరఖాస్తులు సమర్పించాలని, కుటుంబాల వారీగా పరిశీలించి రుణమాఫీకి పంపిస్తామన్నారు.

ధూళికట్ట రైతువేదికలో..

ఎలిగేడు: రైతు రుణమాఫీ-2024 రీషెడ్యూల్‌లో భాగంగా గురువారం మండలంలోని ధూళికట్ట రైతు వేదికలో దరఖాస్తులు స్వీకరించారు. కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు వివరాలను నమోదు చేసి ఫొటో తీసుకున్నారు. రైతు తన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తూ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. 70మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఏవో ఉమాపతి తెలిపారు.

రత్నాపూర్ రైతువేదికలో..

రామగిరి: రుణమాఫీ కానీ రైతులు ఆందోళన చెందొద్దని, కుటుంబ నిర్ధారణ చేసి అర్హులైన రైతులను గుర్తించి మాఫీ చేయనున్నట్లు మంథని ఏడీఏ అంజని అన్నారు. రత్నాపూర్ రైతువేదికలో గురువారం రుణమాఫీ కానీ రైతుల కుటుంబ నిర్ధారణ కార్యక్రమం పరిశీలించారు. రైతుల నుంచి స్వీయ ధృవీకరణ తీసుకుంటామని, రుణమాఫీ కాని రైతులు సంబంధిత పత్రాలను అందజేయాలని సూచించారు. ఏవో శ్రీకాంత్, ఏఈవోలు అరవింద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తీజ్ ఉత్సవం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ 15వ డివిజన్ రాజీవ్‌నగర్ లంబాడీ తండావాసులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఊరేగింపుగా అల్లూరు చెరువులో నిమజ్జనం చేశారు. డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్, తండా వాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత


వీల్‌చైర్ అందజేస్తున్న ఎమ్మెల్యే

ఓదెల: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన కడారి తిరుపతి అనే దివ్యాంగుడికి బాల వికాస పథకం కింద పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గురువారం వీల్ చైర్ అందజేశారు. మాజీ వైస్‌ఎంపీపీ పిట్టల రవికుమార్, మాజీ ఎంపీటీసీ చొప్పరి రాజన్న, నాయకులు కసిరెడ్డి మహేందర్‌రెడ్డి, నాయకులు మచ్చ నాగరాజు, ఆటో సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 2కే రన్


2కే రన్‌ను ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షుడు

ధర్మారం: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి ఎస్సారెస్పీ కెనాల్ వరకు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు క్లబ్ అధ్యక్షుడు రవీందర్‌శెట్టి బహుమతులు అందించారు. పీఈటీలు కొమురయ్య, సంజీవరావు, క్లబ్ సభ్యులు తన్నీరు రాజేందర్, డాక్టర్ శ్రీనివాస్, సామ ఎల్లారెడ్డి, గడ్డం లింగారెడ్డి, కట్ట రమేశ్, నాడెం శ్రీనివాస్, ఎండీ ముజాహిద్, రవి, చంద్రయ్య పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న శ్రీనుబాబు

రామగిరి: సెంటనరీకాలనీ శ్రీరామంజనేయ మేకల మార్కెట్‌లోని మైసమ్మ ఆలయంలో గురువారం కాంగ్రెస్ నాయకుడు, మంత్రి సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన హోమంలో ఆయన పాల్గొన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతియాదవ్, మండల అధ్యక్షుడు రొడ్డ బాపన్న, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, నాయకులు ఆరెల్లి కొమురయ్యగౌడ్, బర్ల శ్రీనివాస్, కొరుకొప్పుల తులసీరాంగౌడ్, కండె పోచం, మేకల మార్కెట్ కమిటీ సభ్యులు ఒర్రె సదయ్య, బసుక అంజయ్య, ఒర్రె సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


సాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన మంథని సతీశ్‌కు గురువారం లయన్స్ క్లబ్ డైరెక్టర్ టి.వి.సురేశ్‌బాబు జన్మదినం సందర్భంగా సభ్యులు నిత్యావసర సరుకులు అందజేశారు. సతీశ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. అతని ఆర్థిక పరిస్థితి విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముల్మారి శ్రీనివాస్ సభ్యులను సంప్రదించారు. లయన్స్ క్లబ్ సభ్యులందరూ కలిసి సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, లయన్స్ క్లబ్ డైరెక్టర్స్ అబ్బు కేశవరెడ్డి, బెల్లం శ్రీనివాస్, మేకల శరణ్య, దొడ్ల శ్రీనివాస్, మేకల మారుతి పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు నివాళి


నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

గోదావరిఖని: బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరులకు గురువారం ఘనంగా నివాళి అర్పించారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో అమరవీరుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. నాయకులు యాకయ్య, వేల్పుల కుమారస్వామి, మహేశ్వరి, నాగమణి, శివ, సతీశ్, క్రాంతి, భాగ్య, అనూష, గీత, రమ, స్వరూప, లింగయ్య, రాము, సాగర్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.